

షీ టీం సేవలపై అవగాహన


సిర్పూర్(టి), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం షీ టీం సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డయల్ 100, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైం వంటి అవశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు రమాదేవి, దినేష్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న టీ స్టాల్ యజమాని

కౌటాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కౌటాల బస్టాండ్‌లోని ఎంఎం టీ స్టాల్ యజమాని మల్లేష్ తన నిజాయితీని చాటుకున్నాడు. ఆదివారం సాయంత్రం టీ పాయింట్‌లోని కుర్చీ దగ్గర 15 వేల రూపాయలు పడి ఉన్నట్లు మల్లేష్ గుర్తించాడు. వెంటనే ఆరా తీశాడు. ఈ విషయాన్ని తన దగ్గరకు వచ్చే వారితో పాటు వాట్సాప్ గ్రూపులో షేర్ చేశారు. డబ్బులు పోగొట్టుకునున్న నాగెపల్లికి చెందిన వశాకే జ్యోతిరావు డబ్బు తనదేని చెప్పి సంప్రదించగా సోమవారం సాయంత్రం మల్లేష్ టీ పాయింట్ వద్ద జ్యోతిరావుకు తిరిగి అందజేశారు. నిజాయితీ చాటుకున్న మల్లేష్‌కు జ్యోతిరావు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించాడు.

రుచికరమైన భోజనం అందించాలి

లింగాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంపీడీవో రామచందర్ సూచించారు. సోమవారం మండలంలోని మారుగూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణమైన విద్యతోపాటు రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట భూపతిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



మిగిలింది మూడు రోజులే

- 14తో ముగియనున్న పీఏసీఎస్‌ల పదవీ కాలం
- రెండోసారి రెన్యూవల్ కోసం చైర్మన్ల పైరవీలు
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయమే కీలకం
- పీఏసీఎస్, డీసీసీబీ పాలకవర్గాల్లో తీవ్ర ఉత్కంఠ

వాంకిడి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాలు(పీఏసీఎస్) పాలకవర్గాల పదవీ కాలం ఆగస్టు 14తో ముగియనుంది. ఇంకా మరో మూడు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. దీంతో పీఏసీఎస్, డీసీసీబీ పాలకవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ పరభుత్వ హయాంలో నియమించిన పాలకవర్గాలే ఇంకా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ మార్పుతో చాలా మంది చైర్మన్లు, డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 77 ప్రాథమిక సహకార సంఘాలు(పీఏసీఎస్)లు ఉన్నాయి. ఒక్కో ప్రాథమిక సహకార సంఘంలో 13 మంది డైరెక్టర్లు మొత్తం 1,001 మంది డైరెక్టర్లు కొనసాగుతున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగించింది. ఈ గడువు సమయం కూడా ఆగస్టు 14వ తేదీతో ముగిసిపోనుంది.

ప్రభుత్వ నిర్ణయమే కీలకం...

పీఏసీఎస్‌ల పదవీ కాలం పొడిగింపు విషయంలో ప్రభుత్వ నిర్ణయమే కీలకంగా మారునుంది. ఆగస్టు 14 లోపు గడువు సమయం పొడిగింపుపై ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే ఆగస్టు 15 నుంచి పీఏసీఎస్‌లతో పాటు డీసీసీబీ పాలకవర్గాలు పూర్తిగా రద్దయ్యే అవకాశం ఉంది. మొదట 2020 ఫిబ్రవరి 15న పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిగాయి. దీంతో 2025 ఫిబ్రవరి 15తో ఐదేళ్ల పదవీకాలం ముగిసిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అధికారంలోకి రావడం ఆవెంటనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యపడదని భావించి మరో ఆరు నెలల పాటు గడువు సమయాన్ని పొడిగించింది. దీంతో ఈ నెల 14తో ఈ గడువు సమయం కూడా ముగిసిపోనుంది. రెండోసారి పొడిగింపు లేకపోతే చైర్మన్లు, డైరెక్టర్ల తమ పదవులు కోల్పోనున్నారు.

పొడిగింపుపై పైరవీలు

డీసీసీబీ, పీఏసీఎస్ చైర్మన్లుగా కొనసాగుతున్న చాలా మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో రెండో సారి రెన్యూవల్ కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తు న్నారు. డీసీసీబీ చైర్మన్‌తో పాటు పీఏసీఎస్ చైర్మన్లు తమకున్న పరిచయాలు, పలుకుబడితో పద వులను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం సర్పంచ్‌లు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు ఎవరు లేకపోవడంతో పీఏసీఎస్ చైర్మన్లకు ప్రొటోకాల్ ఉండడంతో ఈ పదవులకు ప్రాధాన్యం ఏర్పడింది. మరోసారి గడువు సమయాన్ని పొడిగించాలని ప్రభుత్వంపై ఒత్తి ళ్లు తెస్తున్నారు. ప్రభుత్వం కూడా పీఏసీఎస్‌ల పదవీ కాలాన్ని పొడిగించేందుకు అవకాశం ఉందన్న అభి ప్రాయాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఎందుకంటే త్వరలోనే స్థానికసంస్థల ఎన్నికలు జరుగనున్నాయి. హైకోర్టు ఆదేశాల ప్రకారం సెప్టెంబరు 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్ని కలకు ముందు సొసైటీలను రద్దుచేస్తే స్థానిక ఎన్ని కలపై కొంత ప్రభావం పడే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈక్రమంలో ప్రభుత్వం గడువు పొడిగించేందుకు అవకాశం ఎక్కువగా ఉందంటున్నా రు. ఏది ఏమైనప్పటికీ ఈనెల 14తో గడువు ముగుస్తుండడంతో ప్రభుత్వ నిర్ణయమే కీలకంగా మారనుంది.

ట్రాక్టర్‌పై వెళ్లి.. సమస్యలు తెలుసుకొని..



ట్రాక్టర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

తిర్యాణి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం జిల్లా తిర్యాణి మండలంలోని మారుమూల గ్రామాలకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సోమవారం ట్రాక్టర్‌పై వెళ్లి సందర్శించారు. కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మారుమూల గ్రామీణ రోడ్లు బురదమయంగా మారడంతో మండలంలోని దేవాయిగూడ పంచాయతీలోని తోయగూడ, చందుగూడ గ్రామాల ప్రజల సమస్యలను ట్రాక్టర్‌పై వెళ్లి తెలుసుకున్నారు. ఆమె వెంట నాయకులు జగదీష్, కమల, గంగు, దామోదర్, హనుమంతరావు, మారు, పురుషోత్తం, వామన్, దిలీప్, లచ్చన్న, గుణవంతరావు తదితరులు ఉన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న స్వాతంత్ర్య వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలను నిర్వహించేందుకు ఎస్పీ కాంతిలాల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 15వ తేదీన జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించనున్న స్వాతంత్ర వేడుకలను అధికారులు సమన్వయంతో కృషి చేసి విజయవంతం చేయాలని తెలిపారు. వేడుకల ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్, ఆర్డీవో, మండల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని, హాజరయ్యే ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు ఆహ్వాన పత్రాలు, ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాల ముద్రణ ఆర్డీవో పర్యవేక్షించాలని తెలిపారు. ప్రముఖులు, ప్రజల సౌకర్యం కొరకు కుర్చీలు ఏర్పాటు చేయాలని, ప్రతి శాఖ నుంచి ఇద్దరు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల జాబితా సమర్పించాలన్నారు. మైదానంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల శకటాలు, స్టాళ్ల ఏర్పాటు చేయాలని, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు.

మిషన్ భగీరథ డీఈఈగా వి రాజేష్

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ (ఇంట్రా) కాగజ్‌నగర్ డీఈఈగా వేముర్ల రాజేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సిద్ధిఖీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయనస్థానంలో ఎఫ్ఏసీ డీఈఈగా రాజేష్ బాధ్యతలు స్వీకరించారు.

బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి

-ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు రాంచందర్



రాంచందర్ స్వాగతం పలుకుతున్న తహసీల్దార్

కాగజ్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ ద్వారా దళితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తామని ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. సోమవారం కుమురం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన ప్రైవేట్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి సజీవన్, తహసీల్దార్ మధూకర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ దళితుల భూములను ఎవరు అక్రమించకూడదని, ఆక్రమణ జరిగితే సంబంధిత దళిత బాధితులు కమిషన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ ద్వారా దళితులకు సత్వర న్యాయం జరుగుతుందని, అణగారిన సంక్షేమం కోసం కమిషన్ కృషి చేస్తోందన్నారు. అణగారినవర్గాలకు ఎలాంటి అన్యాయం జరిగిన కమిషన్ సత్వరమే స్పందించి దళితుల పక్షాన అండగా నిలుస్తోందన్నారు. జిల్లానుంచి భూమికి సంబంధించిన ఫిర్యాదులే అధికంగా వస్తున్నాయని, ఈ ప్రాంతంలో ఎక్కువగా లావణి పట్టాలున్నందున ఇతరులు అక్రమిస్తున్నారని తెలిపారు. ఈ కారణంగా సంబంధిత బాధితులు కమిషన్‌ను ఆశ్రయిస్తున్నట్లు వివరించారు. దళితుల సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వినతి పత్రాల అందజేత...

కాగజ్‌నగర్‌కు ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు రాంచందర్ దళిత సంఘం వ్యవస్థాపకుడు ఈర్ల సునీల్, బెల్లంపల్లి ఏరియా ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ బి గోపాలకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మయ్య మాదిగ కులస్థుల సమస్యలను పరిష్కారించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘం వ్యవస్థాపకుడు ఈర్ల సునీల్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ ఎస్పీఎం మిల్లులో స్థానికులకు ఉద్యోగ అవకాశాలివ్వటం లేదని, సర్‌సిల్క్ మిల్లు మూతబడిందని, యువతకు ఉపాధి మార్గాలు లేకుండా అనేక అవస్థలు పడుతున్నట్లు వివరించారు. బెల్లంపల్లి ఏరియా ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ బి గోపాలకృష్ణ మాట్లాడుతూ తిర్యాణి మండలం దేవాయిగూడలో 130 మంది మాదిగ కుటుంబసభ్యులకు చెందిన భూములను సింగరేణి సంస్థ తీసుకుందని, ఇంతవరకు మాదిగలకు న్యాయం చేయటం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ మధూకర్, ఎంపీడీవో కోట ప్రసాద్, డీఎస్పీ రామానుజం, రాష్ట్ర కార్యదర్శి శనిగారం మాదిగ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వేముర్ల సంతోష్ మాదిగ, శేఖర్, అశోక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

దహెగాం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం షప్పాల మల్లక్క చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ ప్లేట్స్, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, ఎంఈవో శ్రీనివాస్, డీటీ గణేష్, ఏఎస్సై ప్రకాష్, హెచ్ఎం, శారద, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ పరీక్షలు

చింతలమానేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బగూడ ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యావిభాగం పాఠశాలలో సోమారం ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈవో జయరాజు తెలిపారు. ప్రతీనెలా నాలుగుసార్లు ఉచిత ఫిజియోథెరపీ ఉంటుందని, మండలంలో 18 సంవత్సరాల లోపు దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సునీల్, ఐఈఆర్‌పీ సంధ్యారాణి, సీఆర్పీలు రవీంద్రనాథ్, శివరాం, ప్రధానోపాధ్యాయురాలు కవిత, పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు

దహెగాం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. మండలంలోని మొట్లగూడ, రాంపూర్, గొర్రెగుట్ట, గిరవెల్లి, ఇట్యా, అయినం గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటలకే క్యూలైన్ కట్టారు. ఎకరానికి బస్తా పంపిణీ చేయడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

దశల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దశల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తానమి ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సోమవారం సిర్పూర్(టి) గ్రామ పంచాయతీలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ నిరుపేదకు దశల వారీగా ఇందిరమ్మ ఇళ్ల ఇచ్చి తీరుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటి నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల కోసం దళారులను నమ్మవద్దని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన వెంటనే దశల వారీగా నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని ఎవరినీ ఆశ్రయించవద్దని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం కాలనీల్లో పర్యటించారు. రైల్వే స్టేషన్ వెళ్లే రహదారిపై డ్రైనేజీ నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. బస్టాండు ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్‌కు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఆయన వెంట కమిటీ సభ్యులు తులసీరాం, రాజారాం, సలీం, గణపతి, సత్యనారాయణ, సోహెల్ అహ్మద్, రవీందర్, అఫ్సర్ అహ్మద్, ముక్తగిర్‌హుస్సైన్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఏఈ షగియోద్దీన్, ఈవో తిరుపతి పాల్గొన్నారు.

బుద్ధ విహార్ పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలి

వాంకిడి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుద్ధ విహార్‌లో పూజారులకు దూప, దీప, నైవేద్యం గౌరవ వేతనం ప్రభుత్వం ఇవ్వాలని బుద్ధ విహార్ సమన్వయ సమితి జాతీయ అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం వాంకిడి, ఆసిఫాబాద్ విహార్‌లను సందర్శించిన అనంతరం వాంకిడి జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు దుర్గాజీ, విజయ్, జయరాం, రోషన్, తుకారాం, యశ్వంత్‌రావు, శ్యాంరావు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు నీరు.. ఇబ్బందుల్లో కాలనీ వాసులు



రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుడ గ్రామంలోని గాజులవాడకు వెళ్లే దారిలో రోడ్డుపైనే వర్షపు నీరు నిలిచి ఉండడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీ రోడ్డు నిర్మించినా సైడ్ డ్రైన్ లేక పోవడం తో రోడ్డు పైనే నీరు నిలువ ఉంటుందని అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి

కెరమెరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జోడేఘాట్ రెడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతూ గ్రామస్థులు డీటీ సంతోష్‌కుమార్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ హట్టి బేస్ క్యాంపు నుంచి జోడేఘాట్ వరకు బీటీ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. కల్వర్టులు సైతం కోతకు గురయ్యాయని ప్రమాదాలు సంభవించే పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. ఈ విషయమై గత నెలలో ఎంపీడీవోకు సైతం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే





ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఆసిఫాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం ఇజల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెబ్బెన మండలం గోలేటికి చెందిన తిరుపతి తన పేరిట గల పట్టా భూమిని సింగరేణి సంస్థ భూసేకరణ చేసినందున ఇట్టి భూమిలో 324 నీలగిరి చెట్లకు సంబంధించిన నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు.

ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులు..

- సిర్పూర్(టి) మండలం డోర్‌పల్లికి చెందిన రుషి తన పేరిట చింతలమానేపల్లి మండలం రన్‌వెల్లి గ్రామ శివారులో గల లావుని పట్టా భూమిని వేరొక వ్యక్తి అక్రమంగా పట్టా పొందాడని అట్టి పట్టా రద్దు చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- చింతలమానేపల్లి మండలం బూరెపల్లికి చెందిన సునీత తాను పదవ తరగతి చదివానని, తనకు బూరెపల్లి గ్రామ డీలర్‌గా నియమించాలని దరఖాస్తు అందజేశారు.
- దహెగాం మండలం కమ్మర్‌పల్లికి చెందిన షాజియాబేగం తన భర్త తాతల పేరిట గల భూమిని తనకు తెలియకుండా పట్టా మార్పిడికి ప్రయత్నిస్తున్నందున నిలుపుదల చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.
- పెంచికలపేట మండలం ఎల్కపల్లికి చెందిన పెంటయ్య తాను సాగుచేస్తున్న ప్రభుత్వ భూమిని లావుని పట్టా చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- సిర్పూర్(టి) మండలం డోర్‌పల్లికి చెందిన విఠల్ తన కుమారుడికి 9వ తరగతిలో ఏదైనా గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు.
- సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన బుజ్జి తాను సిర్పూర్(టి) శివారులో సాగు చేస్తున్న భూమికి పట్టా మజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.

సౌర విద్యుత్ ఏర్పాటుకు నివేదికలు రూపొందించాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో సౌర విద్యుత్ ఏర్పాటుకు మూడు రోజుల్లో నివేదికలు రూపొందించి సమర్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో అన్ని ప్రభ్వు కార్యాలయాలు, పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, పోడు పట్టా భూములకు ఇందిరా సౌర గిరి జల వికాస పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతిగృహాలు అన్ని యజమాన్యాల గురుకులాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కావాల్సిన వైశ్యాలం, నెలకు విద్యుత్ వినియోగం వంటి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయంలో ఖాళీ స్థలాల వివరాలు అందించాలని తెలిపారు. ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం కింద సాగునీరు అందించేందుకు అర్హులైన వారి జాబితాను రూపొందించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని యజమాన్య పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించి వర్షపు నీరు పొదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, జిల్లాకు ఆరు వేల ఇంకుడు గుంతల నిర్మాణాలు లక్ష్యంగా నిర్దేశించామని తెలిపారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

ఆసిఫాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మోనూ ప్రకారం పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. సోమవారం ఆసిఫాబాద్ మండలం వట్టివాగు కాలనీలోని గిరిజన ప్రాథమిక పాఠశాల, దిశా ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార నాణ్యత, తరగతి గదులు, రిజిస్టర్‌లు, పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతిలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నాలుగో తరగతి విద్యార్థులకు పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు సౌర కుటుంబం, గ్రహాల గురించి ఆంగ్లంలో వివరించడంతో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, ఏసీఎంవో ఉద్దవ్, ఎస్సీఆర్పీ రవీందర్, ప్రధానోపాధ్యాయుడు మాదవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

వాంకిడి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై తులసిరాం సూచించారు. సోమవారం మండలంలోని జైత్‌పూర్, తేజాపూర్ గ్రామాల్లో ప్రజలకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు గంజాయి, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఏఎస్సై పోశెట్టి, ప్రజలు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తికి జైలు శిక్ష

మందమర్రిటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేకే 5 ఫిల్టర్ బెడ్ ఏరియాకు చెందిన ఏదునూరి సుధాకర్ పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో మోసం చేసిన కేసులో ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి మూడు నెలల జైలు శిక్ష, రూ. 12 వేల జరిమానా విధించినట్లు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ప్రేమ విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు పెళ్లి చేసుకోవాలని యువకుడిని అడగగా దాటవేస్తూ వచ్చాడు. వేరే అమ్మాయితో నిశ్చితార్థం కావడంతో స్థానిక పోలీసులకు యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. 2020 డిసెంబరులో అప్పటి ఎస్ఐ భూమేష్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి నిందితుడు సుధాకర్‌కు మూడు నెలల జైలు శిక్ష, రూ. 12వేల జరిమానా విధించారు.

పొగాకు ప్యాకెట్ల పట్టివేత

తాండూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం నిషేధిత పొగాకు ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం రేపల్లెవాడ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యాన్ అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీలు చేయగా వ్యాన్‌లో పొగాకు ప్యాకెట్లు లభ్యమైనట్లు తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ఆదిల్, సయ్యద్ ఫయాజ్, రాజు అనే వ్యక్తులు మంచిర్యాలకు తరలిస్తున్నారన్నారు. పట్టుకున్న వీటి విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూపులు

- మూడేళ్లుగా బిల్లులు పెండింగ్
- విడుదల కాక తంటాలు
- జిల్లాలో రూ.ఆరు కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు
- కళాశాలలు నడుపలేక తంటాలు పడుతున్న యాజమాన్యాలు
- లెక్చరర్ల జీతాల చెల్లింపులకూ కష్టంగా మారిన వైనం



కాగజ్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంటు సమస్య ఇంత వరకు పరిష్కారం కావటం లేదు. మూడేళ్లుగా బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. కుమురం భీం జిల్లాలో ఆరు కోట్ల రూపాయల మేర బకాయిలు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం హయాంలోనే బిల్లులు క్లియరెన్స్ కాలేదు. ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ కూడా రేపు, మాపు అంటూ అధికారులు కాలం వెళ్లదీస్తున్నట్టు విద్యార్థులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఏడు డిగ్రీ కళాశాలలున్నాయి. ఏటా బకాయిల చెల్లింపు లు చేయాలని విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి తప్పా సమస్యను పరిష్కరించటం లేదని ఆరోపిస్తున్నారు. తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్న విద్యార్థులకు కూడా నిరాశే ఏర్పడింది.

కళాశాలలు నడపలేని స్థితిలో..

కుమురం భీం జిల్లాలో డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంటు సమస్య గుదిబండగా మారింది.

విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయలేని పరిస్థితి..? మరో వైపు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవటంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు సంకట పరిస్థితి నెలకొంది. పాఠాలు బోధించే లెక్చరర్లకు జీతాలు చెల్లింపులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అర్ధాంతరంగా కళాశాలలు మూసివేస్తే విద్యార్థుల భవిష్యత్తు ఏంటనే భావనతో అప్పులు చేసి కళాశాలలను నడిపిస్తున్నారు. రీయింబర్స్‌మెంటు డబ్బులు ఎలాగైనా వస్తాయన్న నమ్మకంతో నడిపిస్తున్నామే తప్పా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో ఇబ్బందులు తప్పటం లేదని పేర్కొంటున్నారు. ఒక వైపు విద్యార్థులు తమ కళాశాల చదివి పూర్తి చేసుకొని వెళ్లిపోతున్నారని, తమ బకాయిలు ఎలా వసూలు చేయాలో అర్థం కాని పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు.

అలాగే విద్యార్థులపై ఒత్తిడి చేయవద్దని కూడా అధికారులు సూచనలు చేస్తున్నారని కళాశాలల కరస్పాండెంట్లు పేర్కొంటున్నారు. పెండింగ్ బకాయిలు క్లియరెన్స్ చేయాలని విద్యార్థి సంఘాలు గతంలో పలు మార్లు ఆందోళనలు చేపట్టాయి. ఆరు నెలల క్రితం తమ కళాశాలలు నడుపబోమని బహిష్కరించారు. నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదు. తమను వెంటనే ఆదుకోవాలని లేని పక్షంలో మళ్లీ పోరుబాటు పడుతామని కళాశాలల యాజమాన్యాలు హెచ్చరిస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్లియర్ చేయాలి..
అన్నం నాగర్జున, ఓయూ జేఏసీ నాయకుడు



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే పూర్తిస్థాయిలో క్లియర్ చేయాలి. ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు కూడా చేశాము. ఇంత వరకు సమస్య పరిష్కరించటం లేదు. ప్రభుత్వం స్పందించకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తాం. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు వెంటనే స్పందిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

బకాయిలు విడుదల కాక ఇబ్బందులు..
రాజమౌళి, వసుంధర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్



విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల కావటం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు, నాయకులకు వినతిపత్రాలు అందజేశాము. ఇంత వరకు సమస్య పరిష్కరించటం లేదు. కళాశాల నిర్వహణ కూడా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరిస్తే బాగుంటుంది.

సైబర్ నేరస్తుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోష్‌కుమార్

కౌటాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు పాల్పడుతున్న నిందితుడిని పట్టుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు కౌటాల సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం. బెజ్జూరు మండలం సలుగుపల్లికి చెందిన ఆత్రం సాయి ఈ ఏడాది మే 13న యూట్యూబ్‌లో హర్షసాయి వీడియోలు చూస్తుండగా అందులో డబ్బులు అవసరమున్న వారు కింది నెంబర్‌కు వాట్సాప్ చేయాలని కనిపించింది. అయితే ఆ నంబర్‌ను చూడగా హర్షసాయి ఫొటోతో ఉండడంతో ఆత్రం సాయి నిజమే అనుకుని నమ్మాడు. వెంటనే ఆ నంబర్‌కు వాట్సాప్ చాట్ చేశారు. ఆర్థిక సహాయం కావాలంటే వెయ్యి రూపాయలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చాటింగ్‌లో తెలిపారు. ఆత్రం సాయి వెయ్యి రూపాయలు పంపాడు. ఆ తరువాత జీఎస్టీ కోసం, ఇతర ఖర్చుల కోసమని మూడు నెంబర్లకు కలిపి 28,500 రూపాయలు పంపాడు. చివరకు మోసపోయానని గ్రహించి జూన్ 13, 2025న సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైం నుంచి బెజ్జూరు పోలీసుస్టేషన్‌కు వివరాలు రావడంతో కేసు నమోదు చేశారు. హర్యానా రాష్ట్రం మేవాడ జిల్లాకు చెందిన తౌఫిక్‌ఖాన్ అనే వ్యక్తి ఖాతాకు రూ.15,100 సాయి పంపాడు. తౌఫిక్ ఫోన్ నంబర్ ట్రాక్ చేయగా 45 రోజులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌లో ఉన్నట్లు గుర్తించారు. కర్నూల్ సిమెంట్ లారీ నడుపుతున్నట్లు గుర్తించాడు. అతను కర్నూల్ నుంచి నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తికి వస్తున్నట్లు ఫోన్ ట్రాకింగ్‌లో గుర్తించిన పోలీసులు కల్వకుర్తి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. తౌఫిక్‌ఖాన్‌తో పాటు ముబారక్‌ఖాన్, ఎండీ వసీం, ఇమ్రాన్, అహ్మద్‌జాన్‌లు కూడా సైబర్ నేరంలో పాల్గొన్నట్లు సీఐ తెలిపారు. అయిదుగురు కలిసి వేరే రాష్ట్రాలకు వెళ్తూ సిమ్‌కార్డులు మారుస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఈ ముఠా సభ్యులు మహబూబ్‌నగర్‌కు చెందిన గజ్జల కుమారస్వామి వద్ద రూ.1,63,000, శ్రీకాంత్ అనే వ్యక్తి ఖాతా నుంచి రూ.20,400, రేణుక అనే మహిళ నుంచి రూ.8950 తమ ఖాతాలకు మళ్లించినట్లు ఆయన తెలిపారు. మిగితా నేరస్తులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సర్దార్ పాషా, సైబర్ క్రైం ఎస్సై తేజస్విని పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

భీమారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపల్లి గ్రామానికి చెందిన ఎగ్గిడి తిరుపతి పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి సోమవారం అందజేసినట్లు భీమారం ఎస్ఐ శ్వేత తెలిపారు. తిరుపతి మే 21న ఖాజీపల్లి నుంచి భీమారానికి తన బైక్‌పై వెళ్తుండగా ఫోన్ పడిపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదుచేసి ఫోన్‌ను తిరుపతికి అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చేనేత కార్మికులను ప్రోత్సహించుదాం

ఆసిఫాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులను ప్రోత్సహించుదామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఇజల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో బెజ్జూరు చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంస్థ కోసిని, గోదావరిఖని వారిచే ఏర్పాటు చేసిన విక్రయ స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేతనే వస్త్రాలను ధరించడం ద్వారా చేనేత కార్మికకుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించాలన్నారు. చేనేత వస్త్రాలు పూర్తిగా నాణ్యతతో కూడి ఉన్నాయని, కలెక్టరేట్‌లో అన్ని శాఖల ఉద్యోగులు, సందర్శకులు స్టాల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిని మిల్లెట్ హనీ స్టాల్స్‌ను పరిశీలించి నాణ్యమైన పదార్థాలను విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో బెజ్జూరు చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంస్థ అధ్యక్షుడు కనకయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



ఆసిఫాబాద్‌లో విధులు బహిష్కరించి నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. న్యాయవాది నరహరిపై అక్రమంగా పెట్టిన అట్రాసిటీ కేసును ఎత్తివేయాలని, అతనిపై దాడి చేసిన దుండగలను కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యం వహించిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవీందర్, చరణ్‌తేజ్, సురేష్, శ్రీనివాస్, శ్యాంకుమార్, విద్యాసాగర్, నగేష్, రవీందర్, మునీర్ అహ్మద్, నరహరి, లాల్యా, గణపతి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ఆసిఫాబాద్ న్యాయవాది నరహరిపై కొంత మంది దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, న్యాయవాదులు కళ్యాణ్, రైయిస్ అహ్మద్, శంకర్‌రావు, కిశోర్‌కుమార్, దయరాజ్‌సింగ్, శ్రీనివాస్, గణపతి, వామన్‌రావు, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 1 నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లల్లో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ పీటీజీ బాలుర పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగులు నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు అందించడం జరుగుతుందని తెలిపారు. నులి పురుగుల కారణంగా పిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలైన రక్తహీనత, పోషకాహార లోపం ఇతర అనారోగ్య సమస్యలను ఆల్బెండజోల్ మాత్రల ద్వారా నివారించవచ్చన్నారు. జిల్లాలో 1,67,702 మంది విద్యార్థులకు 1,53,613 యంది విద్యార్థులకు మాత్రలను వేయగా 92 శాతం నమోదు అయిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సీతారాం, వైద్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యకరమంలో సీహెచ్‌వో, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలోగల కస్తూర్బా గాంధీ బాలికల విద్యార్థులకు నట్టల నివారణ మాత్రలను అందించామని లింగాపూర్ పీహెచ్‌సీ హెచ్‌వో దత్తరామ్ తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సంతోష్, సంధ్యా, రంభ, కస్తుర్బాగాంధీ విద్యాలయ ప్రత్యేకాధికారి ప్రసన్న భారతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. సోమవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం చిర్రకుంటలో రీజియన్ మేనేజర్ గిర్మాజీ నాయక్‌తో కలిసి నూతన భవనంలో శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల వారు రుణ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.1.25 కోట్ల చెక్కును అందజేశారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేనేజర్ స్వామాట్, సెర్ప్‌జిల్లా మేనేజర్ యాదగిరి, తిర్యాణి, ఆసిఫాబాద్ సహాయక ప్రాజెక్టు మేనేజర్లు శ్రీనివాస్, పోమ్లానాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



35 శాతం లాభాల వాటా ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన లాభాల నుంచి 35 శాతం వాటాను కార్మికులకు అందించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఏర్పాటు చేసిన నూతన జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీఐటీయూ కార్మిక సమస్యలపై ఉద్యమిస్తూ సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వంపై పోరాటం చేస్తోందన్నారు. సింగరేణి ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడుస్తున్నా ఇంతవరకు లాభాలపై ప్రకటన చేయకపోవడం సరికాదన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఈవిషయంపై యాజమాన్యంపై ఎలాంటి ఒత్తిడి తీసుకు రావడం లేదని విమర్శించారు. అనంతరం వాస్తవ లాభాలు ప్రకటించి అందించాలని సంతకాల సేకరణ చేపట్టి మేనేజర్ ద్వారా సింగరేణి సీఎండీకి పంపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, మందమర్రి ఏరియా అధ్యక్షుడు సాంబారు వెంకటస్వామి, శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకులు కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, పిట్ కార్యదర్శి శ్రీపతి బానేష్, కోన ఓదెలు, జగన్మోహన్ రెడ్డి, మేశ్రం శ్రీధర్, సిరికొండ శ్రీనివాస్, మహేందర్, రాజేశం పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులతో పనులు చేయించడం మానుకోవాలి

జైపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పర్మినెంటు కార్మికులు చేసే పనులను కాంట్రాక్టు కార్మికులతో చేయించడం సింగరేణి యాజమాన్యం మానుకోవాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కొంత కాలంగా ఇందారం ఓసీపీ గని వద్ద నిబంధనలకు విరుద్ధంగా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులతో పనులను చేయిస్తోందన్నారు. ఓసీపీలోని కన్వేయర్ బెల్టు వద్ద కింద పడిన బొగ్గును తొలగించడానికి కాంట్రాక్టు కార్మికులను నియమించడం జరిగిందన్నారు. గని యాజమాన్యం మాత్రం ఆ పని చేయించడమే కాకుండా ఓసీపీలోని సీఎస్పీ, ఎం సెక్షన్, డిజిల్ ఫిల్లింగ్, ట్రాన్స్‌పోర్టింగ్, టెండల్ పనులకు వాడుకుంటున్నారన్నారు. సెలవు రోజుల్లో ఎలాంటి వేతనాలు చెల్లించకుండా నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు కార్మికులను వాడుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంపై కార్మికులు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను నిలదీయాలని కార్మికులకు సూచించారు.

బొగ్గు పరిశ్రమలకు నష్టం చేస్తున్న ప్రభుత్వాలు

- బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

శ్రీరాంపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు పరిశ్రమలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్, వేజ్‌బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఆరోపించారు. సీసీసీ కార్నర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ, నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జాతీయాకరణకు ముందు ఉన్న పరిస్థితులు బొగ్గు గనుల్లో కనిపిస్తున్నాయన్నారు. శాశ్వత ఉద్యోగులను రానురాను తగ్గిస్తూ, కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యను పెంచుతున్నారన్నారు. అంతేకాకుండా నిబంధనల ప్రకారం వారికి ఇవ్వాల్సిన హై పవర్ కమిటీ వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీకి గురి చేస్తున్నారన్నారు. నానాటికీ కార్మికుల సంఖ్య తగ్గిపోతోందని, బొగ్గు ఉత్పత్తి లక్ష్యం మాత్రం రెండు, మూడు రెట్లు పెరుగుతోందని అన్నారు. అన్‌స్కిల్డ్ కార్మికులకు 1280 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, 500, 600 రూపాయలు మాత్రమే ఇచ్చి .నిబంధనలకు విరుద్ధంగా 12 గంటల పాటు పని చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 రోజులు పని చేయించుకొని 25 రోజుల వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. అయినా వారికి ఇవ్వాల్సిన హక్కులు, వసతులు కల్పించడం లేదన్నారు. హై పవర్ వేతనాలతో పాటు ఖాళీగా ఉన్న క్వార్టర్లు ఇవ్వాలని, లాభాల్లో వాటాను అందించాలని అన్నారు. సీఎంపీఎఫ్‌లో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిగేలా తాము కృషి చేశామన్నారు. రిటైర్డ్ కార్మికులకు పింఛన్ సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేలా సీఎంపీఎఫ్ కార్యాలయాల్లో సిబ్బంది సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు.

సీఎంపీఎఫ్‌లో బొగ్గు రంగంలో పనిచేసే కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల వివరాలను ఆన్‌లైన్ చేస్తామని చెప్పినప్పటికీ రెండేళ్లుగా 60 శాతం మాత్రమే పూర్తయ్యిందన్నారు. మిగతా 40 శాతం త్వరగా పూర్తి చేయాలని కోరారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు సరైన యంత్రాంగం లేదని, శాశ్వత ఏర్పాట్లు చేసి ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి, కేంద్ర నాయకులు రమాకాంత్, రాజారెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, రాజేందర్, రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా ప్రకటించాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కార్మికులు సాధించి పెట్టిన లాభాలను ప్రకటించి 35 శాతం చెల్లించాలని కోరుతూ ఏరియా ఆసుపత్రి సీఎంవో ప్రసన్నకు సీఐటీయూ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ కోలిండియాలో లాభాలు ప్రకటించారని, సింగరేణిలో మాత్రం ఇంత వరకు ప్రకటించకపోవడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. లాభాల వాటా ప్రకటించకపోవడంతో కార్మికులు నిరాశ చెందుతున్నారన్నారు. వెంటనే లాభాలను ప్రకటించి 35 శాతం లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, ఐలయ్య, వెంకటేష్, శ్రీధర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత మాటలను నమ్మవద్దు

శ్రీరాంపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత మాటలను నమ్మి సింగరేణి కార్మికులు మోసపోవద్దని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. గుర్తింపు సంఘంగా అధికారంలో ఉన్న పదేళ్ల సమయంలో టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా కవిత ఉన్నారని, అప్పుడు సమస్యలు పరిష్కారం చేయకుండా ఇప్పుడు బీరాలు పలకడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సొంతింటి కల, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను రద్దు, ఎందుకు నెరవేర్చలేదన్నారు. మొన్నటి వరకు కవితపై కారాలు, మిరియాలు నూరిన హెచ్ఎంఎస్ నాయకులు ఇప్పుడు ఆమెతో కలిసి పనిచేసేందుకు అంగీకారం తెలపడం సిగ్గుచేటన్నారు.

కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట



మాట్లాడుతున్న మందమర్రి ఏరియా జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తోందని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థలోని డిపార్ట్‌మెంట్‌లన్నీ పరస్పరం సహకరించుకోవడం ద్వారా మరింత ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తికి సంబంధించి ఆయా డిపార్ట్‌మెంట్ల పనితీరే కీలకమని తెలిపారు. యంత్రాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఉద్యోగులు గైర్హాజరు విషయంపై గనుల, డిపార్ట్‌మెంట్ల హెచ్‌వోడీలు దృష్టిసారించాలని సూచించారు. ఉద్యోగులకు పనిస్థలాల వద్ద సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి చొరవచూపాలని పేర్కొన్నారు. రక్షణ సూత్రాలను విధిగా పాటిస్తూ విధినిర్వహణ సాగించే విధంగా సూపర్‌వైజర్లకు బాధ్యత ఉందని తెలిపారు. మందమర్రి ఏరియా అభివృద్ధికి సంబంధించి ఉద్యోగులు, అధికారులు అనే తేడా లేకుండా అందరం అంకితభావంతోపని చేస్తే అభివృద్ధిలో ఏరియా నంబర్‌వన్ స్థాయిలో ఉంటుందన్నారు. సమావేశంలో ఐఈడీ (ఎస్ఈ) ప్రవీణ్ కుమార్, ఏఐటీయుసీ బ్రాంచి సెక్రటరీ అక్బర్ అలీ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశాలు విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్: మంగళవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు నిర్వహించే మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు విజయవంతం చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అన్ని డిపార్ట్‌మెంట్లకు చెందిన అధికారులను రెండు జట్లుగా ఏర్పాటు చేసి వారి ద్వారా ప్రతీ గనిపై సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కంపెనీ గత ఆర్థిక సంవత్సరం వెలికితీసిన బొగ్గు ఉత్పత్తి, భూగర్భ గనులు, ఉపరితల గనుల్లో యంత్రాల వినియోగం, బొగ్గు నాణ్యత, మార్కెటింగ్ సవాళ్లపై అవగాహన కల్పిస్తామన్నారు. ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, డీజీఎం (ఐఈడీ) రాజన్న, సీనియర్‌పీవో కాంతారావు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వృద్ధురాలి మృతి

మంచిర్యాలక్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం హమాలీవాడ సూర్యనగర్‌కు చెందిన క్యాతం లక్ష్మి(74) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృతి చెందినట్లు ఏఎస్ఐ ఇలియాస్‌ఖాన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి భర్త విశ్వనాథం కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి లక్ష్మి కుమారుడు సతీష్ వద్దనే ఉంటుంది. లక్ష్మి అస్తమాతో బాధపడుతోంది. సోమవారం గుడికి వెళ్లి ఇంటికి వచ్చే సరికి ఇంటి ఆవరణలో ప్రమాదవశాత్తు కాలు జారిపడింది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అప్పటికే లక్ష్మి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలు లక్ష్మి కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్య



లక్ష్మీప్రసన్న (ఫైల్)

జైపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలాల గ్రామానికి చెందిన దామరకుంట లక్ష్మీప్రసన్న (14) అనే బాలిక ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్ తెలిపి న వివరాల ప్రకారం లక్ష్మీప్రసన్న జైపూర్‌లోని కేజీబీవీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. కొన్నిరోజులుగా పంటినొప్పి, చెవినొప్పితో బాధపడుతుండగా తండ్రి రవి పాఠశాల నుంచి ఇంటికి తీసుకువచ్చాడు. మంచిర్యాలలోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అయినా నొప్పి తగ్గలేదు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని మృతిచెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ డేవిడ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, కార్మికులు తుకారాం, ఇమ్రాన్, సాయి, తిరుపతి, పుష్ప, మీనాక్షి, రాజేష్, నరేష్, భాగ్య పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

భీమిని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జూన్ 5 తరువాత కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 13 లోగా రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి యమునదుర్గ తెలిపారు. 18 నుంచి 59 ఏళ్లున్న రైతులు దరఖాస్తు ఫారం, ఆధార్, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్‌లతో పాటూ నామినీ అధార్ కార్డులను ఏఈఓలకు అం దించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జీవో 49ను రద్దు చేయాలి

వేమనపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జీవో 49ను వెంటనే రద్దు చేసి ఆదివాసీలకు న్యాయం చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రాజారాం గ్రామంలో పోడు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజారాం గ్రామంలో గత 60 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములకు అటవీ శాఖ నుంచి హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. అటవీ అధికారుల బెదిరింపులు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు హన్మంతు, భీమయ్య, చిన్నయ్య, పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

తాండూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. పలువురు సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. బోయపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణ దేవరాయలు ఫిర్యాదు అందించారు. వర్షం పడితే ఇళ్లలోకి నీరు చేరుతుందని సమస్యను పరిష్కరించాలన్నారు. మండలంలోని సుభద్ర కాలనీలో కోతులు కోతులు ఇళ్ల లోకి చొరబడుతున్నాయని, పందులు రోడ్లపై తిరుగుతూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయన్నారు.

వెంటనే వీటి బెద తను తొలగించాలని కోరుతూ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి ఫిర్యాదు అందజేశారు.



మహమ్మారిని తరిమికొడదాం..

టీబీ నియంత్రణలో జిల్లా 11వ స్థానం...

జిల్లాను టీబీ రహిత జిల్లా జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్యులు అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నారు. ఇం దులో భాగంగా జిల్లా వ్యాప్తంగా వ్యక్తిగత ఆరోగ్య వి వరాల పట్టికతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలను సేకరిస్తున్నారు. అందు లో టీబీ వ్యాధిగ్రస్తులను పూర్తి స్థాయిలో గుర్తించి టీబీ వ్యాప్తిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గత ఏడాది రాష్ట్రంలో జిల్లా 17 స్థానంలో ఉం డగా ఈ ఏడాది రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచింది.

- జిల్లాలో కొనసాగుతున్న టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం
- వ్యాధి నియంత్రణలో 11వ స్థానంలో మంచిర్యాల

బెల్లంపల్లి, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి ఒకరికి సోకే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి టీబీ (క్షయ) దీనిపై అవగాహన లేకపోవడంతో ఇంటిలో ఒకరికి ఉంటే ఇంకొకరికి సోకే ప్రమాదం ఉంది. ఈ విషయం తెలియక వ్యాధిబారిన పడుతున్న సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో దేశవ్యాప్తంగా 2030లోగా క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించాలన్నదే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం. ఇందులో భాగంగా జిల్లాలో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ అనుమానితులను గుర్తిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. క్షయ వ్యాధి నియంత్రణకు వైద్య సిబ్బంది కృషి చేస్తుండడంతో జిల్లాలో క్షయ వ్యాధి తగ్గుముఖం పడుతుంది.

వంద రోజుల పాటు జిల్లావ్యాప్తంగా పరీక్షలు...

జిల్లా వ్యాప్తంగా వంద రోజులపాటు పాటు ఇన్‌టెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య బృందాలు పర్యటించి వ్యాధి అనుమానితులను గుర్తిస్తున్నారు. పరీక్షలు నిర్వహించే కార్యక్రమం మే 24 నుంచి ప్రారంభించి వంద రోజుల పాటు కొనసాగనుంది. వీటి నిర్వహణకు డివిజన్‌ల వారిగా ప్రత్యేక వాహనాలను కేటాయించారు. వాటిలో వైద్య సిబ్బంది వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు జిల్లాలో ఒక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. మధుమేహం, బీపీ, దూమపానం అలవాటు ఉన్న వారితోపాటు 60 ఏళ్ల పైబడినవారు క్యాన్సర్ రోగులు, హెచ్ఐవీ పాజిటీవ్, ఐదేళ్ల కిందట క్షయవ్యాధి బారిన పడ్డవారిని పరీక్షిస్తున్నారు.

ఆసుపత్రుల్లో నిర్ధారణ సౌకర్యం..

జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలతో పాటు అర్బన్ హెల్త్ సెంటర్లలో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ఎవరికైన టీబీ నిర్ధారణ అయితే జిల్లాలోని చికిత్స కేంద్రాలు సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట, మందమర్రి, ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలను టీబీ చికిత్స కేంద్రాలు ఉన్నాయి. క్షయ వ్యాధిని మూడు క్యాటగిరిలలో వైద్యులు నిర్ధారిస్తున్నారు. క్యాటగిరి 1 వ్యాధి గ్రస్థులకు ఆరు నుంచి 7 నెలల వరకు కేటగిరి 2 వారికి 8 నుంచి 9 నెలల వరకు, కేటగిరి 3 అయితే 24 నుంచి 27 నెలల వరకు తప్ప కుండా చికిత్సపొందుతూ మందులు వాడాల్సి ఉంటుంది. అదే ప్రభుత్వం నుంచి చికిత్స పొందేవారికి వెయ్యి రూపాయల భత్యం అందించనున్నారు.

శిబిరాలను ఏర్పాటు చేస్తూ రోగులను గుర్తిస్తూ...

జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శిబిరాలు నిర్వహిస్తూ టీబీ రోగులను గుర్తిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఆగస్టు 2 వరకు 49వైద్య శిబిరాలను నిర్వహించారు. ఇందులో 4,587 క్షయ వ్యాధి అనుమానితులను గుర్తించారు. అలాగే ఇందులో 2,220 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ కోసం ఎక్స్‌రేలు చేపట్టారు. గతేడాది 1,282 క్షయవ్యాధి రోగులు ఉండ గా ఇందులో ఇప్పటి వరకు 385 మంది చికిత్స పొందుతున్నారు. మిగితావారికి క్షయ వ్యాధి నుంచి విముక్తి పొందారు. అలాగే ఈ ఏడాది జూలై వరకు 709 మంది క్షయవ్యాధి భారినపడగా ఇప్పటి వరకు ఇందులో 661 మంది చికిత్స పొందుతున్నారు.

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు..

డాక్టర్ సుధాకర్‌నాయక్, జిల్లా క్షయనివారణ అధికారి



టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం. జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. అందులో టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించి చర్యలు చేపడుతున్నాం. వైద్య పరీక్షలు నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి. మద్యం, పొగాకు అలవాటు ఉన్న వారికి వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎవరికైన వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్సను అందిస్తూ చికిత్స పూర్తయ్యే వరకు వెయ్యి రూపాయల చొప్పున పోషణ భత్యం ప్రభుత్వం అందిస్తుంది.



క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సబ్‌కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆదివాసీల నాయకులు

బెల్లంపల్లి, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మనోజ్‌ను ఆదివాసీల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీలకు ప్రధానంగా ఎదుర్కొంటున్న పోడు భముల సమస్య పరిష్కారంతో పాటు ప్రభుత్వం నుంచి ప్రత్యేక సంక్షేమ పథకాలు అందే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. అలాగే పలు ఏజెన్సీ గ్రామాల్లో ఆదివాసీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కొలవార్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్, నాయకులు బాపు, సమ్మయ్య, మణికుమార్, మహేశ్, రాజయ్యలు పాల్గొన్నారు.

భూ సమస్యలను సత్వరం పరిష్కరించాలి

నెన్నెల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. ఆయన సోమవారం నెన్నెల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూభారతిలో మండలంలో దరఖాస్తులు ఎన్ని వచ్చాయి.. వాటిలో ఎన్నింటిని పరిష్కరిచారో ఆరా తీశారు. ఆయా గ్రామాల్లోని పెండింగ్ సమస్యలపై విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఆర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దని చెప్పారు. డిప్యూటీ తహసిల్దార్ ప్రకాష్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

నస్పూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీతారాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ రఘునాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యానభిస్తున్న విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉజ్వల భవిష్యత్ కు పునాది వేసి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు రాణించాల న్నారు. ప్రధాన మంత్రి మోదీ పీఎం శ్రీ పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. మౌళిక సదుపాయాలు కల్పించి విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. పాఠశాలల్లో మెరుగైనా సౌకర్యాలను కల్పించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాను అందించడానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కమలాకర్ రావు, రాజన్న, రాజేశం, తిరుపతి, సుమన్, కొండ వెంకటేష్, జాడి తిరుపతి, సుజిత్ పాల్గొన్నారు.

గంగారం కేసులో పోలీసులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



ఎమ్మెల్యే వినోద్‌తో మాట్లడుతున్న గుంటి శ్రీశైలం

నెన్నెల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గంగారంలో యువకుడి ఆత్మహత్యకు కారుకుడైన వ్యక్తి ఇంటిపై దాడి కేసులో సబంధం లేనివారిపై పోలీసులు కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటి శ్రీశైలం ఎమ్మెల్యే వినోద్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాదులో సోమవారం ఎమ్మెల్యేను కలిసి సంఘటన గూర్చి వివరించారు. యువకుడు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడటంతో కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు మృతికి కారుకుడైన వ్యక్తి ఇంటిపై దాడి చేశారని చెప్పారు. సంఘటనతో సంబంధం లేని కుర్మ కులస్థులైన 27 మందిపై అక్రమంగా కేసులు పెట్టేందుకు పోలీసులు వారి వివరాలు సేకరిస్తున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మృతుడి కుటుంబాన్ని పరామర్శించి వివరాలు తెలుసుకొని కేసులో ప్రమేయం లేని వారికి న్యాయం చేస్తానని మాటిచ్చారని శ్రీశైలం తెలిపారు.

పోడు భూములకు క్రాప్‌లోన్ ఇవ్వాలి

వేమనపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో సాగు చేసుకుంటున్న పోడు వ్యవసాయ భూములున్న రైతులకు బ్యాం కులు క్రాఫ్ లోన్‌లు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వారోత్సవాల సందర్భంగా సోమవారం వేమనపల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మడె మధునయ్యతో కలిసి ఆదివాసీ జెండా ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు మధునయ్య, నాయకులు వెంకన్న, మర్మల నాగమల్లు, కమల, మధునయ్య, పార్వతి, పుల్లయ్య, భీమయ్య పాల్గొన్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

వేమనపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీల్వాయి నుం చి మల్లంపేట వరకు అధ్వానంగా ఉన్న బీటీ రోడ్డుకు కాంగ్రెస్ నాయకులు సోమవారం తాత్కాలిక మరమ్మతులు చేయించారు. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో నిలిచిపోయిన ఈ రోడ్డుమార్గంలో అధికంగా గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై ఉన్న గుంతల్లో మెటల్ కంకర, మొరం పోయించి చదును చేయించారు. మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ లింగాగౌడ్, వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, మాజీ సర్పంచులు తోకల రాంచందర్, గాలి మధు, రమేష్, జగన్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



వనిత సింధూర్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

తాండూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : వనిత సింధూర్ క్లబ్ కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వాసవీక్లబ్ ఇంటర్నేష నల్ వాసవీ జిల్లా కార్పొరేట్ వైస్ చైర్మన్ సంతోష్‌కుమార్ తెలిపారు. అధ్య క్షురాలుగా కేశెట్టి సువర్ణ, కార్యదర్శిగా కొడిప్యాక మాధురి, కోశాధికారిగా రాచకొండ కల్పనలను ఎన్నుకున్నారు. వీరి చేత ఇంటర్నేషనల్ అధికారి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అక్షయ, స్పందన, శిరీష, సునీత, వరలక్ష్మీ, సంధ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి



దేవాపూర్‌లో మాట్లాడుతున్న మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి

కాసిపేట, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకే కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నామని మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి అన్నారు. సోమవారం దేవాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని రాంపూర్, గొల్లవాడ ప్రాంతాల్లో కార్డన్ సర్చ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ అనుమానాస్పదంగా అపరిచిత వ్యక్తులు ఈ ప్రాంతాల్లో తిరుగుతుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులకు ఎవరు కూడ షెల్టర్‌లు, ఇళ్ల అద్దెకు ఇవ్వరాదన్నారు. ఇటీవల పెరిగిపోయిన మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. అందుకే మ త్తు పదార్థాలకు అలవాటు పడవద్దని సూచించారు. సైబర్ క్రైం, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, మూఢ నమ్మకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ద్విచ క్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ వాడుకోవాలన్నారు. కార్లలో ప్రయాణించేవారు సీటుబెల్ట్ ధరించాలన్నారు. వీటి వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుతుందన్నారు. అక్రమంగా గుడుంబా అమ్మిన, బెల్ట్‌షాపులు నిర్వహించిన వారిపై ఎక్సయిజ్ శాఖ ఆధ్వర్యంలో కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరు కూడ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహించరాదని సూచించారు. ధ్రువపత్రాలు లేని 45 ద్విచక్రవాహనాలను గుర్తించి వాటిని అక్కడి కక్కడే జరిమాన విధించారు. రెండు నంబర్‌ప్లేట్ లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేశామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు స్థానిక ప్రజలందరూ సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ గంగారాం, కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు, రామకృష్ణాపూర్, మందమర్రి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాగు సమస్య తీరేనా..?

(5వ పేజీ తరువాయి)

సమావేశం జరిగింది. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఎక్కడా కూడా కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయకపోగా, అవి పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయి. అయినప్పటికీ రెండు, మూడేళ్ల వ్యవధిలో ఏకంగా 55 అక్రమ పట్టాలు పుట్టుకు రావడం గమనార్హం. అధికారుల వైఖరి కారణంగా ఓ వైపు ఎలాంటి జీవనాధారంలేని పేదలు సాగు భూములులేక ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు అక్రమంగా అవి ఇతరుల చేతుల్లోకి వెళ్తున్నాయి. ఇలాంటివి దండేపల్లి మండలంలోనే గాక, ఇతరు చోట్లా ఉన్నాయి.

ప్రభుత్వ నిర్ణయంతోనైనా మేలు జరుగుతుందా..?

ఇదిలా ఉండగా అసైన్‌మెంట్ కమిటీలకు పూర్వవైభవం తెచ్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా పాత అసైన్‌మెంట్ కమిటీలను రద్దు చేసి, కొత్తగా జిల్లాస్థాయిలో ఒకే కమిటీ ఏర్పాటు చేసే యోచనలో ఉంది. కమిటీ చైర్మన్‌గా జిల్లా ఇన్‌చార్జి మంత్రికి బాధ్యతలు అప్పగిస్తుండగా, జిల్లాకు చెందిన ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు సభ్యులుగా ఉండనున్నారు. అలాగే కలెక్టర్ కోచైర్మన్‌గా లేదా కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకునే పేదలకు పాస్ పుస్తకాలు అందించడం, పీవోటీ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్)చట్టం కింద కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరించే అంశంపైనా అసైన్ మెంట్ కమిటీ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

తద్వారా పేదలు సాగు చేసుకుంటున్న ఏజెన్సీ, ఇతర ప్రభుత్వ భూములను వారికే అసైన్ చేయడం ద్వారా వారికి మేలు చేకూర్చే దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

నులి పురుగుల నివారణే ప్రభుత్వ లక్ష్యం



నులి పురుగుల నివారణకు మాత్రలు వేస్తున్న అధికారులు



దండేపల్లిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న సిబ్బంది

మంచిర్యాలక్రైం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణ కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని వైద్యాధికారులు అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం చున్నంబట్టి, రాంనగర్, ఏసీసీ, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నులిపురుగులతో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి మందగించడం, కడు పునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువుతగ్గడం అనారోగ్య సమస్యలు తలెత్తు తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యువో రవూఫ్‌ఖాన్, సీడీపీవో విజయలక్ష్మీ, సూపర్ వైజర్ జ్యోతి, పద్మ, నసీమ, అబాబేబి, లత, పలువురు పాల్గొన్నారు.

దండేపల్లి : ఆరోగ్యవంతమైన విద్యార్థుల కోసం నులి పురుగుల నివారణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని రాజీవ్‌గాంధీ పంచాయ తీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడి కేంద్రాలలో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేశారు. దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులి పురుగుల నివారణ మాత్రలు వేసే కార్యక్రమాన్ని మాజీ ఎంపీటీసీ సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, మండల వైద్యాధికారి డాక్టర్ సతీష్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందుల శ్రీనివాస్, నాయకుడు సత్తయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లింగారెడ్డి, ఏఎన్ఎం విజయకుమారి, ఆశ కార్యకర్తలు సువర్ణ, గంగమణి, లక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమిని : పాఠశాలల్లో చదివే, బడిబయట 19 లోపు ఉన్న పిల్లలందరినీ గుర్తించి నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని వైద్యుడు అనిల్ కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో, భీమిని ఉన్నత పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల దినోవత్సంలో ఆయన ఆయన పాల్గొని మాత్రలను పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు.

సీహెచ్‌వో జలపతి, హెల్త్ అసిస్టెంట్ డి.ఉమాశంకర్, ఏఎన్ఎం మీనా, కస్తూర్బా ప్రత్యేకాధికారి శారద, ఏఎన్ఎం వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమనపల్లి : వేమనపల్లి ఆశ్రమ గిరిజన పాఠశాలలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, ఏఎన్ఎం రాజ్యలక్ష్మీ, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి ఉమాశ్రీ అన్నారు. మండలంలోని బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్‌ను లిపురుగుల మాత్రలను అందజేశారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం సీజన్‌లో సంక్రమించే వ్యాధులు దూరంగా ఉండాలన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల నులిపురుగుల సంక్రమాన్ని నిరోదించవచ్చునని విద్యార్థులు రక్తహీనత, చర్మవ్యాదులు వంటి వ్యాధులు రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటపల్లి : నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు, 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కోటపల్లి మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో ప్రిన్సిపల్ రాజశేఖర్, ఆర్‌బీఎస్‌కే వైద్యాదికారిణి నిహారికలు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం నులి పురుగుల వల్ల కలిగే నష్టాలు, ఆల్బెండజోల్ మాత్రలతో కలిగే నివారణ అంశాలను విద్యార్థులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్, ఏఎన్ఎం తిరుపతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపి..

లక్షెట్టిపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్యులకు అధ్యాపకులకు, సీఐ, ఎస్సైతో పాటు సిబ్బందికి బ్రహ్మకుమారీస్ సోమవారం రాఖీ కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ ఆకుల శ్రీనివాస్, వైద్యులు సురేష్, కృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మన్‌రావు, సీఐ రమణ మూర్తి, ఎస్సై గోపతి సురేష్‌తో పాటు పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

జోన్ లెవెల్ బెస్ట్ క్లబ్‌గా వాసవీ క్లబ్

తాండూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జోన్ లెవెల్ బెస్ట్ క్లబ్‌గా తాండూర్ వాసవీ క్లబ్ ఎంపికైంది. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయం కాలక్షేప మండపంలో నిర్వహించిన సమావేశంలో ఉత్తమ క్లబ్‌గా తాండూర్ వాసవీ క్లబ్ ఎంపికైంది. అలాగే ఉత్తమ కార్యదర్శిగా తాండూర్ వనిత సింధూర్ క్లబ్ కార్యదర్శి కొడిప్యాక మాధురి ఎన్నికై అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయ అధికారి వాసవీయన్ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వైస్ గవర్నర్ బాలమోహన్, నిర్వాహకులు లావణ్య, సంతోష్‌కుమార్, రాము, మధుసూదన్, మహేష్, బాపూజీ, చంద్రశేఖర్, గణేష్, రవీందర్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి..

శ్రీరాంపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అన్నారు. శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలో ఆయన సర్‌ప్రైజ్ విజిట్ చేశారు. వాహనాలు తనిఖీ చేసి, రోడ్డు పక్కనున్న షాపులను దూరంగా ఏర్పాటు చేసుకోవాలని యజమానులను ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కన ఉన్న బండ్లు దూరంగా జరపాలన్నారు. అలాగే ప్రతి షాపు యజమాని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఎస్ఐ సంతోష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూపులు 6
● మూడేళ్లుగా బిల్లులు పెండింగ్ ● విడుదల కాక తంటాలు

మహమ్మారిని తరిమికొడదాం... 7
● జిల్లాలో కొనసాగుతున్న టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం

సాగు సమస్య తీరేనా..?



- నిర్వీర్యమైన అసైన్‌మెంట్ చట్టం
- జిల్లాస్థాయి నూతన కమిటీకి ప్రభుత్వం సన్నాహాలు
- ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న వందలాది మంది
- అధికారికంగా పత్రాలు లేకపోవడంతో తప్పని ఇబ్బందులు

మంచిర్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న పేదలకు ఇకనైనా మేలు జరుగుతుందా...అంటే ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆ అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భూములు లేని నిరుపేదలు, ముఖ్యంగా ఏజెన్సీ ఏరియాల్లో ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు అధికారికంగా ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వాలు అసైన్‌మెంట్ చట్టానికి రూపకల్పన చేశాయి. ఇందులో భాగంగా భూ ములు లేని నిరుపేదలకు ప్రభుత్వ భూములను అసైన్ చేయడం ద్వారా అధికారికంగా వారికి సాగు హక్కులను కల్పించేవారు. దీంతో లబ్ధిదారులు ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటూ జీవనం గడిపేవారు. ఇందులో భాగంగా లబ్దిదారుల ఎంపిక, అర్హులకు భూములు పంపిణీ చేసేందుకు అసైన్‌మెంట్ కమిటీలు సమావేశం అయ్యేవి. అయితే 13 ఏళ్లుగా అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు ఏర్పాటు కాకపోవడం, ప్రభుత్వాలు సైతం ఈ విషయానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో అసైన్‌మెంట్ చట్టం రాష్ట్రంలో నిర్వీర్యం అయింది.

వెంచర్లుగా మారిన ప్రభుత్వ భూములు...

అసైన్‌మెంట్ చట్టం అమలులో ఉన్న సమయంలో ప్రభుత్వ భూములు పొందిన లబ్ధిదారులు వాటిని సాగు చేసుకున్నా...కాల క్రమంలో వాటికి రెక్కలు వచ్చాయి. లబ్ధిదారుల్లో అనేక మంది తమ పేరిట అసైన్ అయిన భూములను విక్రయించగా, ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. వాస్తవానికి అసైన్ భూములు లబ్దిదారులు, ఆ తరువాత వారి వారసులు సాగు చేసుకోవడానికి మాత్రమే ఉద్దేశించినవి. ఆయా భూములను విక్రయించడం, కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరం. అయినప్పటికీ జిల్లాలో పెద్ద మొత్తంలో అసైన్డ్ భూములు ఇతరుల పేరిట పట్టాలుగా మారడం గమనార్హం. లబ్ధి దారుల నుంచి అసైన్డ్ భూములను కొనుగోలు చేస్తున్న పలువురు వాటిని ప్లాట్ల వెంచర్లుగా మార్చి విక్రయిస్తున్నా అడిగేవారు లేరు.

కమిటీ ప్రమేయం లేకుండానే...

అసైన్‌మెంట్ కమిటీ ప్రమేయం లేకుండానే ప్రభుత్వ భూములు ఇతరుల పేరిట పట్టాలుగా మారిన సంఘటన దండేపల్లి మండలం అందుగుల పేటలో ఇటీవల చోటు చేసుకుంది. సర్కారు భూములను అసైన్‌మెంట్ పేరుతో అక్రమంగా కట్టబెట్టిన దాఖలాలు వెలుగు చూశాయి. అధికారులు వాటికి లావణి పట్టాలు జారీ చేశారు. పైగా కమిటీ ప్రమేయం లేకుండానే నేరుగా రెవెన్యూ అధికారులు పట్టాలు జారీ చేయడం గమనార్హం. వాటికి పాసు పుస్తకాలు కూడా పుట్టుకొచ్చాయి. అందుగులపేటలో సర్వే నెంబర్లు 9, 49లో సుమారు 55 ఎకరాలను అసైన్‌మెంట్ చట్టాన్ని తుంగలో తొక్కుతూ గ్రామానికి చెందిన 50 మంది పేర్లను అక్రమంగా రికార్డుల్లో నమోదు చేసిన రెవెన్యూ అధికారులు వాటికి పట్టాలు జారీ చేశారు. సర్వే నెంబర్ 9లో 28 ఎకరాలకు పట్టాలు పుట్టుకరాగా, సర్వే నెంబర్ 49లో మరో 27 ఎకరాలు ఇతరుల పేరిట పట్టాలుగా మారాయి. స్థానిక నాయకులు కొందరు సహకారంతో అధికారులు పట్టాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. గతంలో అసైన్‌మెంట్ కమిటీ గుర్తించినందునే పట్టాలు జారీ చేసినట్లు సర్ది చెప్పే ప్రయత్నం కూడా చేశారు.

నిర్వీర్యమైన కమిటీలు..

ప్రభుత్వ భూములను ఇతరుల పేరిట లావణి పట్టాగా మార్చాలంటే అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం ఉండాలి. రెవెన్యూ డివిజన్ పరిధిలో అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా నియోజకవర్గ ఎమ్మెల్యే వ్యవహరిస్తుండగా, కన్వీనర్‌గా ఆర్డీవో, సభ్యుడిగా తహసీల్దార్ ఉంటారు. వారి ఆమోదంతో ఎలాంటి జీవనాధారం లేని నిరుపేద వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కులస్థులకు నిబంధనల మేరకు ప్రభుత్వ భూములను సాగు చేసుకునేందుకు అసైన్ చేసే వెసులుబాటు ఉంది. అయితే ఇందుకో సం ముందుగా గ్రామంలో అర్హులుగా పేర్కొంటూ తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఆ తీర్మానం ఆధారంగా అసైన్‌మెంట్ కమిటీ సమావేశం కావాల్సి ఉంటుంది. ఆసమావేశంలో దరఖాస్తుదారుల అర్హతలను బట్టి భూములను అసైన్ చేస్తారు. జిల్లాలో చివరిసారిగా 2012- 13లో అసైన్‌మెంట్ కమిటీ...

(తరువాయి 7లో)

నులిపురుగుల నిర్మూలనకు చర్యలు

● వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి హరీష్ రాజ్



నస్పూర్‌లో పిల్లలకు మాత్రలను పంపిణీ వేస్తున్న జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్

నస్పూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగు నిర్మూలనకు చర్యలను చేపట్టామని, ఇందులో భాగంగా జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేస్తున్నమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ అన్నారు. నస్పూర్ పట్టణంలోని ఫ్లడ్ కాలనీ లోగల ప్రైవేట్ పాఠశాలలో సోమవారం అల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీష్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుంచి 19ఏళ్ల వయస్సుగల లక్ష58వేల470మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను తినిపించనున్నట్లు తెలిపారు. పాఠశాలల విద్యార్థులచే ఈ మాత్రలు తినిపించడానికి అంగన్ వాడి కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు, బయట ఉన్న పిల్లలకు అంగన్ వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇవ్వనున్నారన్నారు. ప్రతి పాఠశాలలో ఒక నోడల్ టీచరును ఎంపిక చేసి పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ఏడాదిలో రెండుసార్లు నులిపురుగు నిర్మూలన కార్యక్రమాల చేపట్టుతున్నట్లు హరీష్‌రాజ్ పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యధికారి అనిత, డాక్టర్ శివ ప్రతాప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాందేవ్, ఆరోగ్య కార్యకర్తలు పద్మ, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

● జిల్లా బాలికాభివృద్ధి అధికారి విజయలక్ష్మి



దండేపల్లి కేజీబీవీలో వసతి గృహంలో వసతులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి విజయలక్ష్మి

దండేపల్లి ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బాలికలకు మెరుగైన విద్యాబోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా బాలికాభివృద్ధి శాఖ అధికారిణి విజయలక్ష్మి సూచించారు. దండేపల్లి కర్ణపేట సమీపంలో ఉన్న కస్తూర్బీగాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఆమె తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు, బియ్యం, కూరగాయాల నాణ్యత, భోజనశాల, వసతి గృహంలో గదులు, పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే క్రమశిక్షణతో చదువుకుంటు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా బాగా చదువుకోవాలన్నారు. డిజటల్ విద్యా బోధనతో పాటు ఆన్‌లైన్ క్లాసులతో బాలికలకు మెరుగైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికల పట్ల మర్యాదగా వ్యవహరించి వారిని మీ పిల్లల మాదిరిగానే చూసుకోవాలని విద్యాలయ ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులకు సూచించారు. 1 నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులందరు తప్పకుండా ఆల్బెండజోల్ టాబ్లెట్ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

అభయహస్తం పేరుతో నిధులు దుర్వినియోగం

శ్రీరాంపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పేరుతో సింగరేణి సీఎస్‌ఆర్ నిధులు దుర్వినియోగం చేయడం దుర్మార్గమని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంస్థ సాధించిన లాభాలను ప్రకటించకుండా లక్షల రూపాయల డబ్బులు సివిల్స్ అభ్యర్థులకు పంపిణీ చేయడం సరికాదన్నారు. సీఎస్‌ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులను ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలకు అందించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. యాజమాన్యానికి నిజంగా చిత్త శుద్ధి ఉంటే ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 40వేల కోట్లు రాబట్టాలని సవాల్ విసిరారు. వెంటనే లాభాలను ప్రకటించి 35 శాతం కార్మికులకు అందించాలని కోరారు.

ఎల్లంపల్లికి పెరుగుతున్న వరద

మంచిర్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టం 148 మీటర్లకుగాను ప్రస్తుతం 145.12 మీటర్ల ఎత్తు వరకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను ప్రస్తుతం 12.098 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 6628 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, ఔట్ ఫ్లో 406 క్యూసెక్కులు ఉంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వర్క్స్ స్కీం కోసం 285 క్యూసెక్కులను విడుదల చేస్తుండగా, ఎన్టీపీసీ అవసరాల కోసం 121 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

మంచిర్యాల జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 14.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. భీమిని మండలంలో గరిష్టంగా 57.4 మి.మీ వర్షపాతం నమోదుకాగా, తాండూరులో 36.2, బెల్లంపల్లిలో 30.0, జిల్లా కేంద్రంలో 28.6, జైపూర్ మండలంలో 23.4, మందమర్రి మండలంలో 21.4, కాసిపేట మండలంలో 17.6, నస్పూర్‌లో 13.2, లక్సెట్టిపేట మండలంలో 11.0 మిల్లీ మీటర్ల చొప్పున వర్షం కురిసింది.

స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15న నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో జరగనున్న వేడుకలను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ఉత్తమ సేవలందించే వారి జాబితాను ఈ నెల 13లోగా సిద్ధం చేయాలన్నారు. జాతీయ గీతాలాప, సంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. సందేశం రూపొందించడం కోసం అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను ఈ నెల 12 సాయంత్రం 4గంటలలోగా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో అందించాలన్నారు. అన్నిశాఖల అధికారులు సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, పాల్గొన్నారు.

రాముని చెరువును అభివృద్ధి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని రాముని చెరువును అభివృద్ధి చేయాలని కోరుతూ స్వచ్చంద పౌర సేవాసంస్థ సభ్యులు సోమవారం చెరువు కట్టపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి తుల మధుసూదన్‌రావు మాట్లాడుతూ గత సంవత్సరం డిసెంబరులో రాముని చెరువు వాకింగ్ ట్రాక్‌పై ఉన్న చెట్ల పొదలను తొలగించి ప్రజలు చెరువు చుట్టూ వాకింగ్ చేసు కునే విధంగా అందు బాటులోకి తేవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, కలెక్టర్ త్రిమెన్ కమిటీతో ఎంక్వైరీ చేయించి జనవరిలో ట్రాక్ పునరుద్ధరిం చాలని చెట్లపొదలను తొలగించాలని చెప్పా రన్నారు. 8నెలలు గడుస్తున్నా అధికారులు ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలే దన్నారు.

వెంటనే రాముని చెరువును అభివృద్ధి చేయాలని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కొండయ్య, తిరుపతి, పర్వతాలు, వీరస్వామి, రాధాశ్యామ్, ప్రదీప్, మార్కం డేయులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల కమీషన్ వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సత్తయ్య

● సంఘం జిల్లా అధ్యక్షుడు మోటపలుకుల సత్తయ్య

లక్సెట్టిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ డీలర్లకు వచ్చే కమీషన్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మంచిర్యాల జిల్లా రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మోటపలుకుల సత్తయ్య డిమాండ్ చేసారు. లక్సెట్టిపేట పట్టణంలోని ఆర్ అండ్‌బీ విశ్రాంతి భవనంలో సోమవారం రేషన్‌డీలర్లు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నెలల నుంచి ప్రభుత్వం కమీషన్ ఇవ్వడం లేదని వాపోయారు. కమీషన్ ఇవ్వక పోవడంతో రేషన్ డీలర్లు తమ దుకాణాలకు అద్దె చెల్లించడం లేదని దుకాణ యజమానులు అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఒక అద్దె కాదని కనీసం ఒక్కో రేషన్ కరెంటు బిల్లు కూడా కట్టలేదని గుమస్తాల జీతం కూడా ఇవ్వక పోవడంతో గుమస్తాలు బందు అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయి ఉన్న కమీషన్ చెల్లించి డీలర్లను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్, లక్సెట్టిపేట మండల అధ్యక్షుడు పేరగాని పద్మభూమేష్, రేషన్ డీలర్లు రాజన్న, మనోహర్, అంజన్న, బాపన్న, రామస్వామి పాల్గొన్నారు.

యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు

● కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంట సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా ఉందని, యూరియా పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యతీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వ్యవ సాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరతను సృష్టించడం, యూరియాను పక్కదారి పట్టించడం వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాన్నారు. యూరియా అధిక మొత్తంలో కొనుగోలు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పంట సాగు, దిగుబడికి సంబంధించిన రిజిష్టర్‌లను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 31లోగా వరిధాన్యం సాగు ప్రారంభించాలని, సాగు ప్రారంభంకాని పక్షంలో ఇతర పంటల సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పత్తి పంట సాగులో అంతరపంటగా మునగ సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాల ని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భూక్యచాత్రు, జిల్లా ఉద్యానవన అధికారి అనిత పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణి దరఖాస్తులను అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, నెన్నెల, నస్పూర్, చెన్నూరు, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు అంద జేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్డీవోశ్రీనివాసరావు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

జన్నారం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలని బీసీ కులాల పోరాట సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు కోడూరి చంద్రయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా కులగణను కేంద్రప్రభుత్వం చేయాలని కోరగా కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని 42 శాతం రిజర్వేషన్‌ను స్థానికసంస్థల్లో ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ నుంచి ముస్లింలను తొలగిస్తే బీసీ బిల్లుకు మద్దతిస్తామని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారన్నారు. ఉద్యమ పోరాట సంఘాలు ఏకమై బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి సాధించుకున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు మామిడి విజయ్, శ్రీధర్, గోపాల్, ప్రభాకర్, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్‌జోన్‌లోకి భారీ వాహనాలకు అనుమతులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో శివ్ ఆశీష్ సింగ్

జన్నారం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్‌టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ గుండా భారీ వాహనాలను అనుమతిస్తూ రాష్ట్రఅటవీశాఖ పీసీసీఎఫ్ వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ అథారిటి ఐఎఫ్ఎస్ ఇలూసింగ్ నీరు ఉ త్తర్వులు జారీ చేసినట్లు డీఎఫ్ఎఫ్ ఆశీశ్‌సింగ్ తెలిపారు. సోమవారం అటవీ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఉదయం 6గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భారీ వాహనాలకు అనుమతిచ్చినట్లు తెలిపారు. స్థానికుల డిమాండ్ మేరకు ఈ నెల 4న వైల్డ్‌లైఫ్ మండలి హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించిందని అప్పుడే మండలిలో తీర్మానించినట్లు తెలిపారు. భారీ వాహనాలకు ఎన్విరాన్‌మెంట్ ఫీజు అటవీశాఖ చెక్‌పోస్టులైన తపాల్‌పూర్, ఇందన్‌పల్లి, పాండవాపూర్, కొత్తగూడెం చెక్‌పోస్టులలో 150చొప్పున తీసుకుంటారని కారులకు, జీబులకు 50రూపాయలని తెలిపారు. అటవీని సంరక్షించుకునే బాధ్యత అందరిపైన ఉందన్నారు.

● 27 రోజులుగా మండల కేంద్రంలో భారీ వాహనాలకు అనుమతించాలని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త భూమాచారి, బద్రీనాయక్‌లు స్థానిక అంబేద్కర్ విగ్రహంవద్ద రిలేదీక్షలు చేపట్టారు. సోమవారం నాటికి 27 రోజులు కావడంతో అటవీశాఖ అనుమతులను ఇవ్వడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు. గత జీవోను రద్దుచేసి నూతన జీవోను వెలువరుచడం పట్ల స్థానికులంతా హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం



దండేపల్లిలో భక్త మార్కండేయలయంలో శివుడికి మహారుద్రాభిషేక చేస్తున్న భక్తులు

దండేపల్లి ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మూడో సోమవారం పురస్కరించుకోని దండేపల్లి మండలం లోని పలు దేవాలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెంలో శ్రీసత్య నారా యణస్వామి ఆలయంలో వందలా దిమంది భక్తులు సత్యదేవుడిని దర్శించు కున్నారు. పలువురు భక్తులు కుటుంబ సమేతంగా వ్రతాలను ఆచరించారు.

దండేపల్లిలో మార్కెడేయ స్వామి ఆలయంలో శివుడికి మహా రుద్రా బిషేకం పూజలో పాల్గొని శివుడికి ప్రత్యేక పూజలను చేశారు. పలు దేవాలయాలలో భక్తులతో శ్రావ ణమాస పూజలతో శోభ సంతరించుకుంది.